కడప అన్నమాచార్య కళాశాలకు ఎన్‌బిఎ గుర్తింపు

చింతకొమ్మదిన్నె : కడప-రాయచోటి రింగ్ రోడ్డులో ఉన్న అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల (స్వయం ప్రతిపత్తి)కు నేషన్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్ గుర్తింపు లభించిందని ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల అధినేత చొప్ప గంగిరెడ్డి, ప్రిన్సిపల్ సుధాకర్ రెడ్డి సంయుక్తంగా మాట్లాడుతూ ఎన్‌బిఎ గుర్తింపు కోసం దరఖాస్తు చేసిన తరువాత గత నెల 5 నుంచి 7 వరకు ఏడవ తేదీ వరకు మూడు రోజులపాటు ఎన్‌బిఎ బృందం కళాశాలలో పర్యటించి, కళాశాలలో అమలు చేసే విద్యా విధానాలు, ఫలితాలు, ప్లేస్మెంట్, అధ్యాపకులు, పరిశోధనా విభాగాలు, మౌలిక సౌకర్యాలు, విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలు లాంటివి క్షుణ్ణంగా పరీక్షించారని చెప్పారు. కళాశాలలోని ట్రిపుల్‌ఇ, ఇసిఇ, సిఎస్‌సి విభాగాలకు ఎన్‌బిఎ గుర్తుంపు ప్రదా నం చేశారని తెలి పారు. అనంతరం కళా శాల వైస్ చైర్మన్ చొప్ప ఎల్లారెడ్డి, అభిషేక్ రెడ్డి మాట్లాడుతూ తమ కళా శాలకు ఎన్‌బిఎ గుర్తింపు రావడం హర్షిం చదగ్గ విషయం అన్నారు.

వ్యవసాయ రంగం కుదేలు

వ్య.కా.స అఖిల భారత సహాయ కార్యదర్శి విక్రమ్ సింగ్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాల వలన వ్యవసాయ రంగం కుదేలవుతున్నదనివ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత సహాయ కార్యదర్శి విక్రమ్ సింగ్ అన్నారు. వ్యవసాయ కార్మికుల జీవితాల్లో గణనీయమైన అభివృద్ధి జరగాలంటే భూ సంస్కరణలు అమలు జరగడమే మార్గమని అందుకోసం వ్యవసాయ కార్మిక సంఘం దేశవ్యాప్త ఉద్యమాలు చేపడుతుందని తెలిపారు. శనివారం అన్నమయ్య జిల్లా హార్సిలీహిల్స్‌లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాలు ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్త ఉద్యమాలు బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. దేశవ్యాప్తంగా బిజెపి విదానాలకు, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమాలు పెద్దఎత్తున పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇందుకు అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం విశేషమైన కృషి చేసిందని తెలిపారు. వ్యవసాయ ఉద్యమాలు మరింత బలోపేతం కావాలనే లక్ష్యంతో దేశారాజధాని ఢిల్లీలో నూతన కార్యాలయ భవన నిర్మాణం చేపట్టామని, ఈ భవన నిర్మాణానికి వ్యవ సాయ కార్మికులు నిధులు అందించి సహ కరించాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధి పని ప్రదేశాల్లో పర్యటలు చేసి సమస్యలు గుర్తించి వాటి పరిస్కారం కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు, రవి, నారాయణ, పుల్లయ్య, అన్వేష్, ఓబులరాజు, పెద్దన్న, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విక్రమ్ సింగ్

నేడు ఎపిపిఎస్‌సి పరీక్షలు

- పటిష్ట నిర్వహణకు చర్యలు : డిఆర్‌ఒ

ప్రజాశక్తి - కడప

'డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్' ఉద్యోగాల కోసం శనివారం జిల్లాలోని ఏడు పరీక్షా కేంద్రాల్లో స్క్రీనింగ్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర గౌడ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఎపిపిఎస్‌సి) ఆధ్వర్యంలో నిర్వహించే డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణపై పరీక్షల జిల్లా ప్రత్యేక అధికారులైన పర్యవేక్షకులు పివి నవ జ్యోతి (సెక్షన్ ఆఫీసర్), ఎ. నాగలక్ష్మి (అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్) లతో కలిసి డిఆర్ఒ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ఆధ్వర్యంలో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ భర్తీ కోసం స్క్రీనింగ్ పరీక్ష శనివారం ఉదయం 09.00 గంటల నుంచి 11.30 గంట వరకు నిర్వహిస్తారని తెలిపారు. అభ్యర్థులను తమ పరీక్ష కేంద్రాలకు ఉదయం 07.30 గంటల నుండి 08.30 గంటల వరకు మాత్రమే అనుమతించాలి సూచించారు. పరీక్ష కేంద్రాలలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కార్యకలాపాలకు తావు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. లైజెన్ ఆఫీసర్లు, చీఫ్ సూపర్‌వైజర్లు, పోలీసు యంత్రాంగం సమన్వయంతో పనిచేసి పరీక్షలను సజావుగా, ఎలాంటి అక్రమాలకు తావివ్వకుండా జరిగేలా చూడాలని సూచించారు. పోలీసు శాఖ ప్రతి సెంటర్‌లోనూ బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు, వారి వెంట వచ్చే వారికి ఎలాంటి కొరత లేకుండా ఆయా పరీక్ష కేంద్రాల యాజమాన్యాలు అన్ని వసతులను ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లాలోని కడప, ప్రొద్దుటూరు పట్టణాల పరిధిలో శ్రీనివాస ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఉక్కాయపల్లె, చెన్నై- హైదరాబాద్ బైపాస్ రోడ్, కడప, అన్నమాచార్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, ఆర్టీవో ఆఫీస్ వద్ద, ఊటుకూరు, కడప. కెఒఆర్ఎం కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, తాడిగొట్ల, సికె దిన్నె, కడప, కెఎస్ఆర్ఎం కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, తాడిగొట్ల, సికె దిన్నె, కడప. కెఎల్ఎం. కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (ఉమెన్), తాడిగొట్ల, సికె దిన్నె, కడపలలో పరీక్షలుంటాయన్నారు. ప్రొద్దుటూరు పరిధిలోలోసాయి రాజేశ్వరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, తాళ్ళమాపురం రోడ్, లింగాపురం, ప్రొద్దుటూరు. చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, పల్లవోలు, చాపాడు మండలంలలో పరీక్షల నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎఒ విజయ్ కుమార్, పరీక్షల విధులు కేటాయించిన ఏడుగురు లైజెన్ ఆఫీసర్లు, ఏడుగురు చీఫ్ సూపరింటెండెంట్లు, అసిస్టెంట్ సెక్రటరీ, సెక్షన్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసుర్లు, లైన్ అప్ డిపార్టుమెంట్లు(లేబర్, పోలీస్, మెడికల్, ఎపియస్ ఆర్టిసి, ఎపిఎస్ పిడిసియల్) శాఖల సంబందిత అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ గంగాధర్ గౌడ్

హెచ్‌ఐవి చిన్నారుల కోసం చైల్డ్ ఫ్రెండ్లీ సెంటర్

- జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ నాగరాజు

ప్రజాశక్తి - కడప అర్బన్

హెచ్‌ఐవితో జీవిస్తున్న చిన్నారులకు వినోదం, విజ్ఞానం కోసం చైల్డ్ రండి సెంటర్‌ను ఏర్పాటు చేశామని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కె.నాగరాజు తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో సూప రింటెండెంట్ డాక్టర్ సురేశ్వర్‌రెడ్డితో కలిసి సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ హెచ్‌ఐవితో జీవిస్తున్న పిల్లలు వైఆర్ కేర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్ సురేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ హెచ్‌ఐవి పిల్లలను ఎఆర్‌టిసిలకు తీసుకురావడానికి తల్లిదండ్రులు, సంరక్షకులు మొగ్గుచూపుతారని పేర్కొన్నారు. అదనపు జిల్లా వైద్య అధికారి డాక్టర్ రవిబాబు మాట్లాడుతూ సేవలను తప్పకుండా వినియోగించుకోవాలని చెప్పారు. తరచూ ఏఆర్ టి సెంటర్ వద్దకు తీసుకురావాలని కోరారు. ఆరోగ్యాన్ని మెరుగుపరిచేలా పౌష్టికాహారాన్ని మందులను తీసుకోవాలని తెలిపారు. డిపిఎం భాస్కర్ మాట్లాడుతూ హెచ్‌ఐవితో జీవించడం అంత బాధాకరమైన విషయం కాదని పేర్కొన్నారు. వైఆర్‌జి కేర్ సెంటర్ రాష్ట్ర మేనేజర్‌రాజు సెంటర్ ఏర్పాటుకు సహకరించిన జిల్లా వైద్యాధికారి సర్వజన సూపరింటెండెంట్ కు ధన్యవాదాలు తెలిపారు.

సెంటర్‌ను ప్రారంభిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ నాగరాజు

డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌టియు నాయకులు

పాఠ్యపుస్తకాలను సకాలంలో పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠ్యపుస్తకాలు, యూనిఫాం బ్యాగ్‌లు, షూ్యష్ పాఠశాల పునః ప్రారంభం నాటికే స్కూల్ పాయింట్‌కు చేరేలా చర్యలు తీసుకోవాలని, ఈ క్రమంలో ప్రధానోపాధ్యాయులకు ఎటువంటి ఆర్థిక భారం లేకుండా చర్యలు తీసుకోవాలని ఎస్‌టియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ బాషా, నరెడ్డి సంగమేశ్వరరెడ్డి కోరారు. శుక్రవారం డిఇఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా ఉర్దూ మీడియం పాఠశాలలకు తగినన్ని పాఠ్య పుస్తకాలు సరఫరా కావడం లేదని పేర్కొన్నారు. ఉర్దూ, ఇంగ్లీషు మీడియం కలిగి ఉన్న ఉన్నత పాఠశాలల్లో ఉర్దూ మీడియంతో పాటు ఇంగ్లీష్ మీడియం చదివే విద్యార్థులకు సెకండ్ లాంగ్వేజ్‌గా ఉన్న తెలుగు పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు సరఫరా కావడం లేదని చెప్పారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఈ విద్యా సంవత్సరమైనా పరిష్కరించేఆల కృషి చేయాలని కోరారు. నాలుగు ఏళ్ళుగా జిల్లాలో ఉర్దూ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ పోస్ట్ భర్తీ చేయకపోవడం వల్ల ఉర్దూ పాఠశాలల పరిపాలన పరమైన ఇబ్బందులు వస్తున్నాయని పేర్కొన్నారు. ఆ పోస్ట్ భర్తీకి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపల కన్వీనర్ రవిశంకర్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ చెన్నకేశవరెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి రామమోహన్ పాల్గొన్నారు.

జబర్దస్త్ ఈవెంట్‌ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

డ్రీమ్ మీడియా, పార్క్ ఈవెంట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 26న నిర్వహించే జబర్దస్త్, స్థానిక ఈవెంట్‌ను జయప్రదం చేయాలని నిర్వాహకులు అనీషా, సుజాత కోరారు. శుక్రవారం ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయచోటి రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న కడప కన్వెన్షన్ సెంటర్లో సాయంత్రం ఐదు గంటలకు కామెడీ షో ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. జబర్దస్త్ టీంలో వెంకీ మంకీ, మోహన్, హరి, రాజమౌళి, అప్పారావు హాజరవుతారని చెప్పారు. పులివెందుల నుంచి స్థానికంగా టీం వస్తుందని తెలిపారు. స్మైలీ ఈవెంట్స్, కిడ్స్ డాన్స్ ఉంటాయని చెప్పారు. టికెట్ ధర రూ.300గా నిర్ణయించామని పేర్కొన్నారు. పోలీస్, కార్పొరేషన్ శాఖ అనుమతి తీసుకున్నామని చెప్పారు. కడపలో ఇలాంటి ఈవెంట్స్ ఎప్పుడు చేయలేదని తెలిపారు. స్థానికంగా ప్రజలు కూడా భాగస్వామ్యం కావాలని కోరారు. సమావేశంలో స్పాన్సర్స్ సుజాత, అనుబేగ్, రాజేష్, సునీల్ పాల్గొన్నారు

ఈవెంట్ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

బకాయి బిల్లుల చెల్లింపునకు అవకాశం కల్పించండి

ప్రజాశక్తి - కడప అర్బన్

పిఆర్‌సికి ముందు చెల్లించాల్సిన డిఎ బకాయిల బిల్లుల చెల్లింపునకు అవకాశం కల్పించాలని కడప జిల్లా ఖజాన శాఖ ఉప సంచాలకులు వెంకటేశ్వర్లను యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు. శుక్రవారం జిల్లా ఖజానా కార్యాలయంలో ఖజాన శాఖ ఉప సంచాలకులు వెంకటేశ్వర్లును కలిసి యుటియఫ్ కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ కడప మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సంబంధించిన జూలై 2018, నుంచి 2021, జూన్ వరకు 60 నెలలకు సంబంధించిన పది విడతల డిఎ అరియర్స్ బిల్లులు అనేక మార్లు ఖజానా శాఖకు సమర్పించినప్పటికీ వాటిని ఆమోదించకపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుతం తిరిగి బిల్లులు సమర్పించడానికి అవకాశం లేకుండా పోయిందని తెలిపారు. డిఎ అరియర్స్‌కు సంబంధించిన టైల్స్ డిడిఒ లాగిన్‌లో ఓపెన్ చేయవలసిందిగా కోరారు. జిల్లాల విభజన తదితర కారణాల వల్ల చాలామంది ఉద్యోగ, ఉపాధ్యాయులు బిల్లులు సమర్పించలేక పోయారని చెప్పారు. వాటిని ప్రస్తుతం సమర్పించుటకు అవకాశం కల్పించాలని కోరారు. ఖజానా శాఖ ఉపసంచాలకులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమస్యను రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వీలైనంత త్వరగా బిల్లులు సమర్పించుటకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి సి.వి. రమణ, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు బత్తుల చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ, వీరన్న పాల్గొన్నారు.

ఖజానా శాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి : కమిషనర్

ఇంజినీర్ అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి - కడప అర్బన్

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్‌చంద్ అధికారులను ఆదేశించారు. మార్నింగ్ విజిట్‌లో భాగంగా శుక్రవారం టిజిపి పార్క్, భగత్‌సింగ్‌నగర్ యుపిహెచ్‌సి, ఎర్రముక్కపల్లి జంక్షన్, గాంధీ ప్లాజా, టిఎల్‌ఎఫ్ బిల్డింగ్, దేవుని కడప టాయిలెట్‌లను ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగ అధికారులతో కలిసి పరిశీలించారు. టిజిపి పార్కులో నిర్వహిస్తున్న పనులను పనులను పరిశీలించి ఎంట్రన్స్ గేట్, ఆర్చ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. లేయర్స్ గుర్రం పాతు ఏర్పాటు చేయాలన్నారు. లెవెల్స్ తీసుకున్న తర్వాత రోలింగ్ చేయించే విధంగా చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ విభాగ అధికారులకు సూచించారు. పార్కులో ఉన్నటువంటి షెడ్ వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టాలని టౌన్ ప్లానింగ్ విభాగా అధికారులకు సూచనలను ఇచ్చారు. పార్కులో చెట్లకు ఇబ్బంది కల్గకుండా 12 అడుగుల వెడల్పు గల పాత్వే ఏర్పాటు చేయాలని అధికారులకు సూచనలను ఇచ్చారు. కడప నగర ప్రజల కోసం చింతకొమ్మదిన్నె పోలీస్ స్టేషన్ వెనుక వైపు నూతనంగా ఏర్పాటు చేస్తున్న యుపిహెచ్‌సి నిర్మాణ పనులను పరిశీలించారు. దేవుని కడప టెంపుల్ వద్ద ప్రజల కోసం ఏర్పాటు చేస్తున్నటువంటి పబ్లిక్ టాయిలెట్ పరిశీలించారు.

సమస్యలుంటే తెలియజేయాలి

-ఎన్‌పిసిబి జెడి డాక్టర్ సునీల్‌నాయక్

ప్రజాశక్తి-కడప అర్బన్

ఎన్‌పిసిబి జాయింట్ డైరెక్టర్ విజయవాడ డాక్టర్ సునీల్ నాయక్ శుక్రవారం కడప ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఉన్న కంటి విభాగాన్ని సందర్శించారు. ఐఒపిలో కంటికి సంబంధించి ఎలాంటి పరికరాలున్నాయి, ఇంకేమైనా అవసరమా అని కంటి విభాగంలోని వైద్యులతో, హెచ్‌ఒడితో చర్చించారు. ఆపరేషన్ థియేటర్లో ఇన్‌స్ట్రుమెంట్స్ ఏమి ఉన్నాయి, వాటి పని తీరు గురించి తెలుసుకున్నారు. ఒపి ఎంత మంది వస్తున్నారని వివరాలు అడి గారు. తర్వాత డిస్ట్రిక్ బ్లైండ్ కంట్రోల్ సొసైటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని పారామెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్లు అందరికీ స్కూల్ స్క్రీనింగ్ ఏ విధంగా చేయాలి, ఎలా చేస్తే బాగుంటుంది, కాంట్రాక్ట్ ఆపరేషన్ ప్రోగ్రామ్‌ను ఏ విధంగా స్టెప్ ఆన్ చేయాలా, స్కూల్ స్క్రీనింగ్ చిల్డ్రన్ ప్రోగ్రామ్ ఏ విధంగా స్టెప్ ఆన్ చేయాలి అనే దాని గురించి చర్చించారు. ఆప్తమిక్ ఆఫీసర్ల జాబ్ చాట్, విధివిధానాల గురించి తెలుసుకున్నారు. సమస్యలు ఏవైనా ఉంటే చెప్పా లని సూచించారు. కార్యక్రమంలో డిబిసిఎస్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ సునీత, రవికుమార్ డి. సుధాకర్ రెడ్డి, లక్ష్మి రెడ్డి, రిమ్స్ ఆప్తాల్మిక్ ఆఫీసర్ కంభం చిన్నయ్య, విజయ్‌కుమార్, పిహెచ్‌సిల ఆప్తాల్మిక్ అధికారులు పాల్గొన్నారు.

కంటి విభాగ సిబ్బందితో మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ నాయక్

డిజిటల్ చేసిన తాళపత్ర గ్రంథాల పెన్‌డ్రైవన్‌ను అప్పగిస్తున్న సదాశివమూర్తి

సిపి బ్రౌన్ కేంద్రానికి

డిజిటల్ తాళపత్ర గ్రంథాలు అప్పగింత

ప్రజాశక్తి- కడప అర్బన్

శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో తాళపత్ర పరిరక్షణ విభాగం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని తాళపత్ర గ్రంథాలను డిజిటైజ్ చేసి వైవీయు సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రానికి శుక్రవారం అప్పగించింది. యోగివేమన విశ్వవిద్యాలయం సి.పి.బ్రౌన్ భాషాపరిశోధనకేంద్రం శ్రీవేంకటేశ్వర వేదవిశ్వ విద్యాలయంతో గతేడాది అక్టోబర్ 10న ఎంఒయు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వైవీయూ విసి ఆచార్య చింతా సుధాకర్, కుల సచివులు ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మార్గదర్శకం మేరకు బ్రౌన్ గ్రంథాలయ సంచాలకులు ఆచార్య తప్పెట రాంప్రసాద్ రెడ్డి గ్రంథాలయంలోని తాళ్ల పత్రాల డిజిటలైజేషన్‌కు173 బండిల్స్‌లో ఉన్న 288 తాళపత్ర గ్రంథాలను వేద విశ్వవిద్యాలయానికి అందజేశారు. వారు డిజిటలైజేషన్ చేసి సంబంధించిన పెన్ డ్రైవ్‌ను ఆచార్య రాణిసదాశివమూర్తి సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఒయు ప్రకారం గ్రంథాలను ఉచితంగా క్లీనింగ్, ఆయిలింగ్, ఇంకింగ్ చేశారని అన్ని వివరాలతో డిజిటైజేషన్ ప్రక్రియ పూర్తి చేశారని తెలిపారు. జ్ఞానరక్షణ యజ్ఞమును నిర్వహించిన శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయానికి బ్రౌన్ గ్రంథాలయం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

ఎపిజిబి చైర్మన్‌ను కలిసిన రెడ్‌క్రాస్ అధికారి

ప్రజాశక్తి - కడప అర్బన్

నూతనంగా ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ చైర్మన్‌గా భాద్యతలు చేపట్టిన సత్య ప్రకాష్ సింగ్‌ను మర్యాద పూర్వకంగా గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం రెడ్ క్రాస్ అధికారి శివ శంకర్ రెడ్డి కలిశారు. దేశవ్యాప్తంగా ఉన్న గ్రామీణ బ్యాంకులలో కెల్లా ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ నిరర్థక ఆస్తులును తగ్గించుటలోనూ, లాభా ర్జనలోను ము ందంజలో ఉందని తెలిపారు. నూతన చైర్మన్ సారథ్యంలో మరింత ముందుకు సాగి నంబర్ వన్ స్థానం లో నిలువాలని ఆకాంక్షించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ జిల్లా వ్యాప్తంగా చేస్తున్న సేవల గురించి వివరించారు. రక్తదానం గురించి అవగాహన కల్పించుట, రక్త దాన శిబిరాలు నిర్వహించుట, రక్త గ్రూపులు తెలియ చేయుట, ప్రకృతి వైపరిత్యాలలో బీద బాధితులను ఆదుకోవటం, మొక్కలు నాటు కార్యక్రమం, ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తుందని చెప్పారు. మరిన్ని సేవలు గ్రామీణ ప్రాంతాలలో విస్తృతంగా అందించేందుకు గ్రామీణ బ్యాంక్ వారి సహా య సహకారాలు అందించాలని కోరారు. ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ కూడా గ్రామీణ బ్యాంక్ వ్యాపారాభి వృద్ధిలో తమ వంతు సహకారం అందిస్తుందని తెలిపారు.


చైర్మన్‌ను సన్మానిస్తున్న ఇండియన్ రెడ్ క్రాస్ అధికారి శివశంకర్‌రెడ్డి

స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ వాయిదా

ప్రజాశక్తి - కడప

కడప జిల్లా పరిధిలోని (7 బాలుర, 12 బాలికల) 19 డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతిలో, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈనెల 25 న నిర్వహించే స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు జిల్లా సమన్వయ అధికారి ఎల్. మాధవి లత తెలిపారు. మళ్లీ ఎప్పుడు స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహించే తేదీలను త్వరలో తెలియజేస్తామని తెలిపారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులు, విద్యార్థులు గమనించాలని కోరారు.

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి- కడప అర్బన్

పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 16 సెంటర్లలో 1098 మంది విద్యార్థులు తెలుగు పరీక్షకు హాజరు కావాల్సి ఉంది. అయితే 581 మంది విద్యార్థులు పరీక్షలు హాజరయ్యారు. 517 మంది గైర్హాజరయ్యారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఎనిమిది సెంటర్లను, డిఇఒ అనురాధ జయనగర్ కాలనీలోని జడ్పీ హైస్కూల్ సెంటర్‌లో పరిశీలించారు.

వైవీయూ అభివృద్ధిని ప్రశ్నార్థకం చేస్తే సహించం

ప్రజాశక్తి - కడప అర్బన్

డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనాన్స్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా ఉన్న ఇసి సురేంద్రనాథ్‌రెడ్డి రాజకీయ పలుకుబడితో వైవీయూను నీరుగారుస్తున్నారని పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకన్న విమర్శించారు. శుక్రవారం పిడిఎస్‌యు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే భవనాల అప్పగింత ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రధాన పరిపాలన, ఇతర భవనాలు డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనాన్స్ విశ్వవిద్యాలయంకు ఇవ్వడం సరైన నిర్ణయం కాదని తెలిపారు. తక్షణమే నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే ఉన్నత ప్రమాణాలతో యోగివేమన విద్యాలయంకు పేరుందని చెప్పారు. పరిశోధనల్లో, విద్యా బోధనల్లో అత్యున్నత స్థాయి పేరుందని తెలిపారు. మరే ఇతర విశ్వవిద్యాలయాల్లో లేని విధంగా వివిధ రంగాల్లో నిష్ణాతులైన అధ్యాపక బృందం వైవీయూలో ఉందన్నారు. వారి పరిశోధనలతో మంచి పేరు వర్సిటీకి వచ్చిందని చెప్పారు. ఇక్కడ పరిశోధనలు చేసిన విద్యార్థులు అనేక దేశాల్లో పరిశోధకాలుగా ఉన్నత స్థాయిలో ఉన్నారని పేర్కొన్నారు. వైవీయూకు అనుబంధంగా డిగ్రీ, పీజీ,లా, ఫిజికల్ ఎడ్యుకేషన్, బిఎడ్ కళాశాలలతో పాటు దూర విద్యతో వర్సిటీ ఉన్నత స్థాయిలో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ తరుణంలో డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనాన్స్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ అయినా ఇసి సురేంద్రనాథ్ రెడ్డి తన మనుగడ కోసం వైవీయూను దెబ్బ తీయాలని చూస్తున్నాడని విమర్శించారు. వర్సిటీకి కేంద్రం అయినా పరిపాలన భవనాన్ని, ఇతర ప్రధాన భవనాలను ఆర్కిటెక్చర్ యూనివర్సిటీకి ఇచ్చే నిర్ణయాన్ని వైవీయూ అధికారులు వెనక్కు తీసుకోవాలన్నారు. వాస్తవానికి వైవీయూ అధికారులు కూడా ఇసి సురేంద్రనాథ్ రెడ్డితో మిలాఖత్ అయ్యారన్నారు. అందువలనే వైవీయూ అధికారులు ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు వచ్చాయని డొంకతిరుగుడు మాటలు మాట్లాడుతున్నారన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనాన్స్ విశ్వవిద్యాలయానికి తరగతుల నిర్వహణకు గురుకులం బిల్డింగులు ఇవ్వాలని పిడిఎస్‌యు గా డిమాండ్ చేస్తుందన్నారు. వైవీయు మీద రుద్దాలని చూస్తే సహించమన్నారు. సమావేశంలో పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి జి.శ్రీనాథ్ యాదవ్, నగర కార్యదర్శి గణేష్, నాయకుడు మనోజ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అంకన్న

వంకల పునరుద్ధరణ ఎప్పుడో?

కడప రోడ్డులో ఉన్న వంకలో పెరిగిన కంపచెట్లు

ఇళ్ల మధ్యకు వర్షపు నీరు - ఇబ్బందుల్లో కాలనీ వాసులు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని పలు వంకల పరిస్థితి అధ్వానంగా ఉన్నది. వంకలో కంప చెట్లు పెరిగి పరిస్థితి చాలా దారుణంగా ఉంది. వంకల పునరుద్ధరణ తమ బాధ్యత కాదని మున్సిపాలీట అధికారులు పేర్కొంటున్నారు. గత కొంత కాలం నుంచి వనిపెంట రోడ్డులోని కాలనీ వాసులు మున్సిపాల్టీ అధికారులకు తమ సమస్య గురించి విన్నవిం చుకుంటున్నారు. చివరకు అధికారులు పలకడం లేదని పేదలు సిపిఎం ఆధ్వర్యంలో నిధుల సేకరణలకు భిక్షాటన చేపట్టిన సంఘటనలున్నాయి. చాలాచోట్ల వంకలు, కాలువలు ఆక్రమణకు గురయ్యాయి. దీంతో నీరు ప్రవహించేందుకు అవకాశం లేకుండా ఇళ్ల మధ్యకు వర్షపు నీరు వచ్చే ప్రమా దముంది. చెరువు నుంచి వచ్చే అలుగు నీరు ప్రవహించేందుకు బద్వేల్ రోడ్డు నుంచి కడప రోడ్డుకు కాలువ ఏర్పాటు చేశారు. ఈ కాలువ పూర్తిగా ఆక్రమణలతో, పూడికతో నిండి ఉండటం వల్ల నీరు ప్రవహించే అవకాశం లేదు. వర్షాకాలం నీరు పూర్తిగా రోడ్ల మీదికి వచ్చే పరిస్థితి ఏర్పడుతుంది. కడప రోడ్డులోని తెగిపోయిన గండి వంక పరిస్థితి కూడా అంతే. సర్వాయపల్లి రోడ్డులోని వంకల చుట్టూ పెద్దపెద్ద కంపచెట్లు మెలచి వంక పూర్తిగా నిండి పోయింది. బద్వేల్ రోడ్డులో సుందరయ్య కాలనీ పైభాగాన ఉన్న వంక కూడా ఆక్రమణకు గురైంది. ఉప్పు వాగులో ఆక్రమణలు తొలగించాలని పలుమార్లు అధికారులకు కాలనీ ప్రజలు వినతి పత్రాలు కూడా అందజేశారు. సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్లను కలిసి పూడికతీత చేపట్టాలని, ఆక్రమణలు తొలగించాలని కోరిన సందర్భాలున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని వంకలలో పూడికతీత పనులు చేపట్టి ఆక్రమణలు తొలగిస్తే వర్షాకాలం లోతట్టు ప్రాంతాలు నీట మునగ కుండా ప్రజలకు ఇబ్బందులు తొలగిపోతాయి.

మాట్లాడుతున్న ఎడిఎ వెంకట సుబ్బయ్య

పంటల సాగుపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ముద్దనూరు

ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే పంటలపై రైతులకు అవగాహన కల్పించి నిరంతరం అందుబాటులో ఉండాలని ముద్దనూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వెంకట సుబ్బయ్య సిబ్బందికి సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం ఎడిఎ అధ్యక్షతన వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి క్షేత్ర స్థాయి సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులను అన్ని విధాలా సమాయత్తం చేయాలన్నారు. విత్తనాలు ఎంత పరిమాణంలో ఎన్ని క్వింటాళ్లు కావాలని రైతులను అడిగి తెలుసుకోవాలన్నారు. సాగుచేసే పంటల వివరాల గురించి అన్నదాతలను అడిగి తెలుసుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉంటూ పంటలపై సలహాలు, సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు. వ్యవసాయ అధికారి మాట్లాడుతూ పంట సాగు సమయంలో విత్తన శుద్ధి ప్రాముఖ్యత గురించి రైతులకు వివరించాలన్నారు. ఖరీఫ్‌లో సాగుచేసే కంది, పత్తి, జొన్న, కొర్ర, మినుము, వేరుశనగ పంటలపై అవగాహన కల్పించాలని సూచించారు. పత్తి పంట సాగుచేసే రైతులకు గట్ల వెంబడి రెండు వరుసలు నాన్ బిటి పత్తి విత్తనాలు నాటుకునేలా అవగాహన కల్పించాలన్నారు. నాన్ బిటి నాటడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి రైతులకు వివరించాలన్నారు. లోతు దుక్కుల ఆవశ్యకతపై రైతులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో గణాంక అధికారి నవతేజ పాల్గొన్నారు.

చెరువు కట్ట వెంబడి ఏపుగా పెరిగిన కంప చెట్లు

కంపచెట్లు తొలగించండి

ప్రజాశక్తి -ఖాజీపేట

మండలం పరిధిలోని దుంపలగట్టు చెరువుకట్టకు ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగి ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో ప్రయాణించాలంటే అవస్థలు పడాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. పొలాలకువెళ్లలేని పరిస్థితి ఉందని కంప చెట్లు తొలగించి దారి కష్టాలు తీర్చాలని వేడుకుంటున్నారు. దుంపలగట్టు గ్రామం నుంచి కట్ట మార్గం ద్వారా పొరుగు గ్రామం పాటిమీది పల్లెకు ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారని, వెంటనే చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మండల మాజీ ఉపాధ్యక్షులు షరీఫ్ మృతి

ప్రజాశక్తి -ఖాజీపేట

మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు ఖాజీపేటకు చెందిన కొత్తపల్లె మహబూబ్ షరీఫ్ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి చెందడం పట్ల పలువురు విచారం వ్యక్తం చేశారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులుగా. ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. వైసిపి నాయకులు రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యులు అచ్చు కట్ల కరీముల్లా, కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ మాజీ చైర్మన్ దుగ్గిరెడ్డి శ్రీనివాసుల రెడ్డి పరామర్శించి నివాళులు అర్పించారు.

దోమలపై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ వైద్య ఆరోగ్య శాఖ అధికారి

పరిశుభ్రతతోనే రోగాలు దూరం

ప్రజాశక్తి - వేంపల్లె

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే రోగాలు రాకుండా ఉంటాయని డిప్యూటీ వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఖాజాముద్దీన్ అన్నారు. శుక్రవారం డ్రైడే సందర్భంగా వేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బెస్తవారిపల్లెలో ప్రజలకు శుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుభ్రత లేకపోతే ప్రజలకు మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, బోదకాలు, మెదడువాపు వ్యాధి వంటి వ్యాధులు దోమల ద్వారా వస్తాయని చెప్పారు. దోమల నివారణకు ప్రతి శుక్రవారం ప్రజలందరూ డ్రైడేగా భావించి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. నీటి నిల్వ ఉన్న చోట దోమలు ఉద్ధి చెందుతాయని చెప్పారు. లార్వా నుంచి దోమగా మారడానికి దోమగా మారుటకు 10 రోజుల సమయం పడుతుందని చెప్పారు. లార్వా దోమగా మారక ముందే 7వ రోజున నీరు నిల్వ ఉంచిన తొట్లు, బానలు, డ్రమ్ముల నుంచి నీటిని పారబోసి వాటిని టెంకాయపీచుతో బాగా శుభ్రపరచాలని కోరారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య మాట్లాడుతూ లార్వా దశలోనే దోమల్ని నాశనం చేసేందుకు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో ఉన్న వారందరూ ఒకే రోజు డ్రైడేని పాటిస్తే డెంగీ, మలేరియా జ్వరాలను సమర్థవంతంగా అరికట్ట వచ్చు అన్నారు. కార్యక్రమంలో అరోగ్య కార్యకర్తలు భాస్కర్, నాగేశ్వర్, సిహెచ్ఓ వీణా కుమారి, ఆశా కార్యకర్త లక్ష్మి పాల్గొన్నారు.

ఘర్షణలకు దూరంగా ఉండాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఎన్నికల అనంతరం ఫలితాలు వెలబడుతున్న నేపథ్యంలో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పులివెందుల డిఎస్‌పి వినోద్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజవర్గంలో ఎన్నికలు సజావుగా ముగిశాయని, ఫలితాలు అనంతరం ఎలాంటి ఘర్షణలు దిగిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే గ్రామాలలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించడంతోపాటు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎవరైనా ఫలితాలు అనంతరం అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో రూరల్ సిఐ బాల మద్దిలేటి, ఎస్ఐ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డిఎస్‌పి వినోద్‌కుమార్

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

- కెవికె సమన్వయకర్త డాక్టర్ వీరయ్య

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

సమగ్ర యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు పొందవచ్చని కెవికె సమన్వయకర్త డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని కోలుములపల్లె గ్రామంలో శుక్రవారం కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరు వారి ఆధ్వర్యంలో వ్యవసాయ కళాశాల మహానంది నాలుగవ సంవత్సరం విద్యార్థులు రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు, కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ వీరయ్య మాట్లాడుతూ పత్తి, పసుపు సాగులో ఆచరించాల్సిన పద్ధతులను తెలియజేశారు. ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ అంకయ్య కుమార్ మాట్లాడుతూ సమగ్ర సస్యరక్షణలో జిగురు అట్టల వినియోగం గురించి, జీవ నియంత్రిక పురుగుమందుల గురించి రైతులకు క్లుప్తంగా వివరించారు. వృక్ష శరీర ధర్మ విభాగం సహాయ ఆచార్యులు వెంకటేష్ బాబు మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా వ్యవసాయ విద్యార్థులు కళాశాలలో తరగతి గదుల్లో తెలుసుకున్న అంశాలను ప్రత్యక్షంగా రైతుల పొలాల్లో పరిశీలించడానికి, రైతులతో ఆచరింప చేయడానికి మంచి ప్రయోజనకరంగా కార్యక్రమం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఉద్యాన శాస్త్రవేత్త మానస మాట్లాడుతూ తమలపాకు, పసుపు పంటలలో పాటించాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతుల గురించి, చీని,నిమ్మ చెట్లలో ఎండు తెగుళ్ల నివారణకు పాటించాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు సులభరీతిలో అర్థమయ్యే విధంగా వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు సమీకృత వ్యవసాయ పద్ధతులు, నేల, నీటి సంరక్షణ పద్ధతులను, సోలార్ పెన్సింగ్ వంటి అంశాలపై ప్రతిమలను, విత్తనాలను, చార్టులను, మోడల్స్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కెవికె విస్తరణ శాస్త్రత డాక్టర్ మహేష్ బాబు, కళాశాలకు చెందిన విద్యార్థులు, కోలములపల్లె, పెద్దపుత్త, దుగ్గాయ పల్లెకు చెందిన రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయ ప్రదర్శనను పరిశీలిస్తున్న కెవికె సమన్వయకర్త వీరయ్య

నివాళులర్పిస్తున్న అభిమానులు

32 వేల సంకీర్తనలు రచించిన అన్నమయ్య

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

భక్తగ్రేసరుడైన అన్నమయ్య 32వేల సంకీర్తలను రచించి సమాజానికి అందించారని టిటిడి మాజీ సభ్యుడు చిప్పగిరి ప్రసాద్ అన్నారు. స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయసేవాకేంద్రంలో శుక్రవారం పద కవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల 616వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అన్నమయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 32వేల అన్నమయ్య కీర్తనలలో ప్రస్తుతం 12వేల మాత్రమే మనకు అందుబాటులో ఉన్నాయన్నారు. రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, వేటూరి ప్రభాకరశాస్త్రి కృషి వల్ల అన్నమయ్య పదసాహిత్యం మనకు లభించారని చెప్పారు. మరో టిటిడి మాజీ సభ్యుడు టంగుటూరి మారుతీప్రసాద్ మాట్లాడుతూ పండిత పామరులకు సులభగ్రాహ్యంగా అన్నమయ్య పదాలను రచించారన్నారు. మామూలు మాటలతో గంభీరమైన వేదాంత విషయాలను కూడ చెప్పారన్నారు. ఉపాధ్యాయసంఘాల సమన్వయవేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ తెలుగునుడికారం స్వచ్ఛమైన భావన సంపద అన్నమయ్య పదాలలో అడుగడుగునా కనిపిస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రముఖ భావవతార్ ఎడవల్లి రమణయ్య రాష్ట్రభాషోపాధ్యాయ సంఘ రాష్ట్ర అధ్యక్షులు అంకాల్ కొండయ్య, కోశాధికారి భోగాగంగాధర్, ఉపాధ్యక్షులు సాయికుమార్, వారాది మధు, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు ఓబులరెడ్డి, ఉపాధ్యాయులు సుధాకర్ పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపులో నిర్లక్ష్యం చేయొద్దు

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటేష్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

జూన్ 4న నిర్వహించే ఓట్ల లెక్కింపు ప్రక్రియలో అలసత్వానికి చోటు లేదని అందరూ అప్రమత్తంగా ఉండాలని రిటర్నింగ్ అధికారి వెంకటేష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఆర్‌డిఓ కార్యాలయంలో ఆయన సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ కడపలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ కళాశాలలో ఉంటుందని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్, ఇవిఎం లెక్కింపు ఎలా చేయాలి వంటి వాటిపై వివరించారు. లెక్కింపు కేంద్రంలో అసెంబ్లీకి 14 టేబుల్, పార్లమెంటుకు ఏర్పాటు చేస్తారని, వీటికి సంబంధించి అధికారులను నియమిస్తారని తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ అధికారులు ఎలక్ట్రానిక్, మొబైల్ వంటి వాటిని కౌంటింగ్ కేంద్రంలోనికి తీసుకెళ్లరాదని సూచించారు. కౌంటింగ్ నిర్వహించే సమయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఎటువంటి ఆరోపణలకు తావు ఇవ్వకూడదన్నారు. కార్యక్రమంలో పులివెందుల తహశీల్దార్ రమేష్ బాబు, డిటిలు మల్లికార్జున, త్రిభువన్ రెడ్డి, రెడ్డి లక్ష్మి ఎన్నికల సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటేష్

రిజిస్ట్రేషన్ చేయించుకునే విధానాన్ని తెలియజేస్తున్న వ్యవసాయ అధికారి

రైతు వాటా ధర చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ప్రజాశక్తి- చక్రాయపేట

ఈ ఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగు చేసుకునే రైతులు ప్రభుత్వం అందించే సబ్సిడీ ధర పోను, రైతు వాటా చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయ అధికారి నవంత్ బాబు తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నారాయణ రకం వేరుశనగ 30 కిలోల బస్తా పూర్తి ధర రూ 21 90 కాగా, ప్రభుత్వం సబ్సిడీ రూ 1164 ఫోను మిగిలిన రైతు వాటా రూ 1746 చెల్లించాలన్నారు. కె-6 రకం విత్తనాలు రూ. 2850 సబ్సిడీ రూ1140 ఫోను మిగిలిన రైతు వాటా రూ1710 చెల్లించాలన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి బుధవారం నుంచి వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేస్తామని తెలిపారు. నారాయణ 1000 క్వింటాళ్లు, కే సిక్స్ 400 క్వింటాలు. మంజూరైనట్లు వారు తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ లింక్ అయినా సెల్ తీసుకెళ్లాలన్నారు. ఆయా గ్రామాల్లో త్వరగా రిజిస్టర్ చేయించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌బికెలు సహాయకులైన శివ లలిత, సురేఖ, రైతులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వైద్య సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జాతీయ ఆరోగ్య మిషన్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ శశిభూషణ్ రెడ్డి, జిల్లా గణాంకాధికారి రమేష్‌రెడ్డి, జాతీయ ఆరోగ్య మిషన్ జిల్లా ప్రోగ్రాం అధికారి నారాయణ, ఉప గణాంకాధికారి హరినాథ్, మేనేజ్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టం అధికారి రాజ శేఖర్‌తో కూడిన జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం సభ్యులు అన్నారు. శుక్రవారం పట్టణ లోని నగరిగుట్ట, శ్రీరామ టెంపుల్ ఆయుస్మాన్ ఆరోగ్య మందిర్ (గ్రామ ఆరోగ్యశాల)ను సందర్శించి విస్తృతంగా తనిఖీ నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఆరోగ్య పర్యవేక్షకులు, సామాజిక ఆరోగ్య అధికారులు, బహుళార్థసాధక ఆరోగ్య సహాయకులు, ఎఎన్ఎం, ఆశాలతో సమావేశం ఏర్పాటు చేసి వైద్య ఆరోగ్యసేవలు వాటి అమలులో జరుగుతున్న జాప్యం, లోపాల నివారణ తదితర విషయాలపై సమీక్ష నిర్వహించారు. ప్రజలు తమ ఆరోగ్యం పట్ల అవగాహన మెరుగు పరుచుకోవాలని చెప్పారు. తక్కువ ఖరీదు కలిగి స్థానికంగా లభించే సమీకృత ఆహారాన్ని తీసుకోవడం, వ్యాయం చేయడం, దురలవాట్లకు దూరంగా ఉండడం, ఒత్తిడిలేని జీవన విధానం వంటి వాటితో మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ శాంతి కుమార్, డాక్టర్ ప్రత్యూష, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కుంగుతున్న రోడ్లు

ఇబ్బందుల్లో వాహనదారులు - పట్టని అధికారులు

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక పంచాయతీ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో రోడ్లు కుంగుతున్నాయి. దీంతో అయా ప్రాంతాల్లో తిరిగే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అండర్ డ్రెయినేజీ కోసం కాంట్రాక్టర్లు రోడ్డు మధ్యలో ప్రతి వీధిలోనూ గుంతులు తీసి అడపాదడపాగా మట్టితో పూడ్చారు. దీంతో రోడ్లు మధ్యలో కుంగి పోతున్నాయి. శుక్రవారం విశ్వనాథ్ రెడ్డి వీధిలో లోడ్‌తో వెళ్తున్న వాహనం ఇరుక్కుని పోయింది. వాహనం రోడ్డు మధ్యలో ఇరుక్కుని పోవడంతో అ ప్రాంత ప్రజలు అవస్థలు పడ్డారు. సరుకుల రవాణా చేసే వాహనాలను వీధుల్లో నడపాలంటే డ్రైవర్లు జంకుతున్నారు. గతంలోనూ అయా ప్రాంతాల్లో వాహనాలు ఇరుక్కొని పోయిన సందర్భాలు ఉన్నప్పటికి అధికారులు పట్టించుకోక పోవడంతో ప్రజలు, వాహనదారులు పెదవి విరుస్తున్నారు. రోడ్డు మధ్యలో గుంతలు పడుతుండడంతో రాత్రి సమయంలో మోటర్ సైకిల్, ఆటోలు వెళ్లే సమయంలో ప్రమాదాలకు గురవుతున్నాయి. జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

విశ్వనాథ్‌రెడ్డి వీధిలో ఇరుక్కుపోయిన వాహనం

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ఇందిరమ్మ కాలనీలో కౌనెల్సింగ్ ఇస్తున్న సిఐ మస్తాన్

ప్రజాశక్తి - మైదుకూరు

ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు ఆదేశించిన నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని వాటిని బేఖాతరు చేస్తే కఠిన చర్యలు తప్పవని మైదుకూరు అర్బన్ సిఐ మస్తాన్ హెచ్చరించారు. శాంతి భద్రతల పర్యవేక్షణలో భాగంగా మైదుకూరు ఇందిరమ్మ కాలనీలో ప్రజలతో తమ సిబ్బందితో కలసి శుక్రవారం సమావేశమయ్యారు. శాంతి యుతంగా కౌంటింగ్ ముగిసే వరకు ప్రత్యేక పోలీసు నిఘా ఉంటుందని, నలుగురుకు మించి గుమికూడరాదని తెలిపారు. ఎలాంటి అల్లర్లు, గొడవలకు పాల్పడరాదని, టపాసులు, ఊరేగింపులు నిర్వహించరాదని తెలిపారు. విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులకు సమావేశాలకు అనుమతులు లేవని తెలిపారు. కౌంటింగ్ ముగిసినా, జూన్ 6 వరకు నిబంధనలు అమల్లో ఉంటాయని తెలిపారు. ఎంతటి వారైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

తమ బిడ్డల భవిష్యత్తు కోసం : మైదుకూరు ఇందిరమ్మ కాలనీలో ప్రతి ఒక్కరూ కష్టపడి జీవిస్తున్నారని, రెక్కాడితే కానీ కానీ డొక్కాడని మధ్య తరగతికి చెందిన వారున్నారని తెలిపారు. మీరు మీ బిడ్డల భవిష్యత్ కోసం కష్టపడుతున్నారని, ఎలాంటి గొడవలు, దురఅలవాట్ల జోలికి వెళ్లవద్దని సూచించారు. మీ బిడ్డల భవిష్యత్ మీ చేతుల్లో ఉందని సిఐ మస్తాన్ ఇందిరమ్మకాలనీ వాసులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. గొడవలు, అల్లర్లు చేసుకుని జీవితాలను కష్టమయం చేసుకోవద్దని మీ కుటుంబ శ్రేయస్సు కోసం పాటుపడండన్నారు. మీకు మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

కర్నాటి శ్రీను, తండ్రి సుబ్బరాయుడు, బుచ్చనపల్లి గ్రామం, గోపవరం మండలం, కడప జిల్లా అను నేను మా ఇంటి నుండి పాస్‌పోర్టును జిరాక్స్ తీయించుకొనుటకు వెళుతుండగా మార్గమధ్యలో పోయింది. ఎంత వెతికినా కనపడలేదు.
పాస్‌పోర్ట్ నెంబరు : **N2463142**
ఎవరికైనా ఈ పాస్పోర్టు
దొరికిన ఈ సెల్ నెంబర్ :
6281221006 కు తెలుపగలరు.